నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 9 జూలై 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

మళ్లీ నిర్బంధ కాండ!

విప్లవ సంఘాల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపే ప్రయత్నం

● సామాన్య జీవితం గడుపుతున్న నేతలకు సంకెళ్లు ● నిఘాకు ప్రత్యేక బృందాలు!

● తాజాగా మాజీ మావోయిస్టు రమాకాంత్ అరెస్టుతో కలకలం ● సింగరేణి వ్యాప్తంగా ఆందోళన ● మాజీ నేతల్లో మళ్లీ అలజడి

కరీంనగర్, జూలై 8(నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ రామకృష్ణాపూర్ : ప్రజాపాలన పేరిట కాంగ్రెస్ మళ్లీ నిర్బంధకాండ మొదలు పెట్టిందా..? విప్లవ సంఘాల పేరిట అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ, ఇప్పుడు వారిని తొక్కే ప్రయత్నం చేస్తున్నదా..? జన జీవన స్రవంతిలో కలిసి, సామాన్య జీవితం గడుపుతున్న నాయకులపైనా ఉక్కుపాదం మోపుతున్నదా..? అందుకోసం ప్రత్యేక పోలీస్ బృందాలను రంగంలోకి దించి, అరెస్ట్‌లు చేయిస్తున్నదా..? సికాస పేరిట అరెస్టులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నదా..? అంటే అందుకు మావోయిస్టు నేత మహ్మద్ హుస్సేన్ (అలియాస్ సుధాకర్, అలియాస్ రమాకాంత్) అరెస్టే నిదర్శనంగా నిలుస్తున్నది. వివరాల ప్రకారం.. 1978 నుంచి 1981 వరకు కేకే-2 గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేసిన మహ్మద్ హుస్సేన్ మావోయిస్టు పార్టీకి ఆకర్షితుడై చేరాడు. ఉత్తర తెలంగాణ కమిటీ మెంబర్‌గా ఎదిగాడు. మావోయిస్టు అనుబంధ సంఘమైన సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) వ్యవస్థాపక సభ్యుడిగా, సీవోగా పనిచేశాడు. అప్పుడు ఆయనపై వివిధ పోలీస్‌స్టేషన్లలో 28 క్రిమినల్ కేసులు నమోదు కాగా, దాదాపు 12 ఏళ్లు జైలు జీవితం గడిపాడు. చివరగా 2009లో ఝార్ఖండ్ రాష్ట్రంలో అరెస్ట్ అయి, 2013 వరకు జైలు జీవితం గడిపి బయటకు వచ్చాడు. అనారోగ్య కారణాలతో బెయిల్‌పై విడుదలైన ఆయన, దాదాపు పదకొండేళ్లుగా జమ్మికుంటలో సాధారణ జీవితం గడుపుతున్నాడు. 70 ఏండ్లకు పైబడిన ఆయన, ఇప్పుడు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నాడు. అలాంటి రమాకాంత్‌ను అరెస్ట్ చేయడం విమర్శలకు తావిస్తున్నది.

రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్‌లో మావోయిస్టు నేత మహ్మద్ హుస్సేన్‌ను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అరెస్టుతో కలకలం

రమాకాంత్ రెండు నెలలుగా మావోయిస్టు భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి సింగరేణి కోల్‌బెల్ట్ ఏరియాలో సికాసను పునర్నిర్మాణానికి కృషి చేస్తున్నాడని పోలీసులు తెలిపారు. మందమర్రి, రామకృష్ణాపూర్ ప్రాంతాల్లో మావోయిస్టు పార్టీ సానుభూతిపరులకు సోమవారం కరపత్రాలు పంచుతున్నాడని సమాచారం అందిందని చెబుతున్నారు. ఈ మేరకు ప్రత్యేక బృందాలతో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఆర్‌కే-1 గని రోడ్‌లో బ్యాగ్‌తో రమాకాంత్ కనిపించాడు. పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. తనిఖీ చేయగా బ్యాగులో మావోయిస్టుల పేరిట పోస్టర్లు, కరపత్రాలు లభించాయి. వెంటనే ఆదుపులోకి తీసుకుని ఏసీపీ విచారించగా జమ్మికుంటకు చెందిన మహ్మద్ హుస్సేన్‌గా గుర్తించారు. అయితే ఈ అరెస్టుపై బంధువుల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఉదయం జమ్మికుంటలోని తన ఇంట్లో ఉన్న హుస్సేన్‌ను బలవంతంగా పట్టుకెళ్లారని ఆరోపిస్తున్నారు. ఆయనకు కంటి ఆపరేషన్ చేయించాల్సి ఉందని చెబుతున్నారు.

మళ్లీ అలజడి

ఒకప్పుడు తెలంగాణ రాష్ట్రంలో జరిగిన పోరాటానికి సికాస కూడా మద్దతు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతోపాటు అనేక సమస్యలపై సింగరేణి గడ్డ మీద పోరాటాలు చేసింది. అయితే రాష్ట్ర ఏర్పాటు అనంతరం బీఆర్ఎస్ పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూసి అన్ని విప్లవ సంఘాలు దాదాపు తమ కార్యకలాపాలు తగ్గించాయి. అదే కోణంలో ప్రభుత్వం అన్ని రకాల సహకారం అందించడంతో చాలా మంది విప్లవ సంఘాల నాయకులు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. వీరికి ప్రభుత్వం చేయూత నివ్వడంతో సాధారణ జీవితం గడుపుతున్నారు. తాజా అరెస్టుతో లొంగిపోయిన మావోయిస్టులు, సానుభూతిపరులు, విప్లవ సంఘాల నాయకుల్లో అలజడి మొదలైంది. సికాస పునర్నిర్మాణానికి రమాకాంత్ ప్రయత్నం చేస్తున్నాడనే కారణంపై అతన్ని అరెస్టు చేసినట్టు పోలీసులు చెబుతున్నది నిజమైతే ఆయన వయసు రీత్యా ముందుగా అతన్ని పిలిచి

మహ్మద్ హుస్సేన్

హెచ్చరించాల్సింది. కానీ, ఇవేమీ లేకుండా నేరుగా అరెస్టు చేయడం విమర్శలకు తావిస్తున్నది. అలాగే, తమను చూసి పారిపోయాడని చెబుతున్నారు. 70 ఏండ్లకు పైన అనారోగ్యంతో ఉన్న వ్యక్తి ఎలా పారిపోతాడని వివిధ సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. నిజానికి తాము అధికారంలోకి వస్తే ప్రజాపాలన అందిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు అందుకు విరుద్ధంగా వెళ్తుండడం, రమాకాంత్ అరెస్టు చేయడంపై ఆందోళన వ్యక్తమవుతున్నది. అంతేకాకుండా సికాస కార్యకలాపాలపై నిఘా పెట్టడంతోపాటు అరెస్టుల కోసం ఏకంగా ఒక ప్రత్యేక పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తున్నది. అయితే పునర్నిర్మాణం మాట ఎలా ఉన్నా ప్రస్తుత అరెస్టు మాత్రం కలకలం రేపుతున్నది. ఈ అరెస్టు ఇక్కడితోనే ఆగుతుందా? లేక మాజీల విషయంలోనూ ప్రభుత్వం ఇదే కోణంలో ముందుకెళ్తుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

హుస్సేన్ అరెస్టును ఖండించిన పౌర హక్కుల సంఘాల నేతలు

మావోయిస్టు పేరిట మహ్మద్ హుస్సేన్‌ను అరెస్టు చేయడాన్ని రాష్ట్ర పౌర హక్కుల సంఘం, విరసం రచయితలు, తెలంగాణ ప్రజాఫ్రంట్ నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నారు. సోమవారం రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పౌరహక్కుల సంఘం నాయకులు మాట్లాడారు. 74 ఎండ్ల వయస్సు గల మహ్మద్ హుస్సేన్ కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని పద్మశాలీవాడలో 15 ఏళ్లుగా ప్రజలతో కలిసి నివసిస్తున్నాడని తెలిపారు. సోమవారం ఉదయం 6 గంటలకు సివిల్ దుస్తుల్లో వచ్చిన పోలీసులు నిద్రిస్తున్న హుస్సేన్‌ను బలవంతంగా కారులో ఎక్కించుకుని మందమర్రి తీసుకొచ్చారని పేర్కొన్నారు. రామకృష్ణాపూర్‌లోని ఆర్కే1 మైన్ ప్రాంతంలో అరెస్ట్ చేసినట్లు పేర్కొనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆయనను హక్కుల సంఘాల నాయకులకు చూపించాలని కోరినప్పటికీ అనుమతించలేదని తెలిపారు. మంగళవారం ఆయనకు కంటి ఆపరేషన్ ఉందని తెలిపినా వినలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కోల్‌బెల్ట్ ప్రాంతంలో ప్రజ లు, నాయకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నదని, ప్రజాసంఘాల నా యకులపై మావోయిస్టులుగా ముద్రవే స్తూ అక్రమ కేసులు బనాయించేందుకు కుట్రకు తెరలేపిందని ఆరోపించారు. ఇప్పటికైనా మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, శ్రీధర్‌బాబు, స్థానిక ఎమ్మెల్యే వివేక్, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ స్పందించి 12 గంటలలోగా ప్రెస్ మీట్ నిర్వహించి అరెస్టును ఖండించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు కుమారస్వామి, శ్రీపతి రాజగోపాల్, సుచరిత, నార వినోద్, బొడ్డుపెల్లి రవి, జైపాల్ సింగ్, కుటుంబ సభ్యులు మహ్మద్ రబ్బానీ రసూల్‌బీ దంపతులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

జీతాల్లేవ..

ఎస్సీ పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్‌లో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతలు

● మంచిర్యాల జిల్లాలోని ఎనిమిది హాస్టల్స్‌లోనూ ఇదే దుస్థితి

● వేతనాలు కావాలని కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్న వైనం

మంచిర్యాల, జూలై 8(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : జిల్లాలోని ఎస్సీ పోస్టుమెట్రిక్ హాస్టళ్లలో పనిచేసే కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఏడు నెలలుగా జీతా లు రావడం లేదు. మంచిర్యాల జిల్లాకేంద్రంలోని బాయ్స్, గర్ల్స్ హాస్టళ్లుసహా బెల్లంపల్లి, మందమర్రి, లక్షెట్టిపేటలోని బాయ్స్ అండ్ గర్ల్స్ హాస్టళ్లు అన్ని కలిపి ఎనిమిది హాస్టళ్లు ఉన్నాయి. ఇందులో కుక్, అసిస్టెంట్ కుక్, స్వీపర్ అండ్ స్కావెంజర్, డే-వాచ్‌మన్ అం డ్ నైట్-వాచ్‌మన్ అంతా కలుపుకుని 48 మంది పని చేస్తున్నారు. వీరందరినీ కాంట్రా క్ట్ పద్ధతుల్లో ఏజెన్సీల ద్వారా నియమించుకుని పని చేయిస్తున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి టెండర్ దక్కించుకున్న ఏజెన్సీ ఈ ఏడాది మార్చి వరకు డ బ్బులు ఖాతాలో వేశారని సిబ్బంది చెప్తున్నా రు. మార్చి వరకు బిల్లులు తీసుకున్న ఏజెన్సీ నిర్వాహకులు తమకు జనవరి నెల నుంచి జీతాలు ఇవ్వలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తే కనీసం ఆ ఏజెన్సీ నిర్వాహకులను పిలిచి మాట్లాడం లేదని ఆరోపిస్తున్నారు. నెల రోజులుగా జీతాల కోసం ప్రజావాణిలో దరఖాస్తులు పెట్టుకుంటూ కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలో సోమవారం ప్రజావాణికి వచ్చిన సిబ్బంది తమ కష్టాలను 'నమస్తే తెలంగాణ'కు చెప్పుకున్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన హాస్టల్ సిబ్బంది

వేల రూపాయలు గోల్‌మాల్

నిబంధనల ప్రకారం 100 మంది పిల్లలున్న హాస్టల్‌లో పనిచేసే కుక్‌లకు నెలకు రూ.20 వేలు ఇవ్వాలి. 100నుంచి 150మంది వి ద్యార్థులుంటే రూ.25 వేలు, 150 నుంచి 200 మంది పిల్లలుంటే రూ.30 వేలు ఇవ్వాలి. ఇలా 200 మంది విద్యార్థులున్న హాస్టళ్లు జిల్లాలో నాలుగు ఉన్నాయి. ఇక్కడ ముగ్గురు కుక్‌లు పని చేస్తున్నారు. ఒక్కో కుక్‌కు రూ.6,500 చొప్పున రూ.19,500 మాత్ర మే చెల్లిస్తున్నారు. మిగిలిన రూ.10,500 ఎవరి చేబుల్లోకి వెళ్తున్నాయన్నది అర్థం కావడం లేదని సిబ్బంది చెప్తున్నారు. స్వీపర్ అండ్ స్కావేంజర్ జీతాల్లో రూ.3వేలు, డే వాచ్‌మన్, నైట్ వాచ్‌మన్ జీతాల్లో రూ.1500 ఇలా అందరి జీతాల్లోనూ వేల రూపాయలు మిగుల్చుకుని జిల్లా ఎస్సీ శాఖలో పని చేసే కొందరు అధికారులు కార్లు కొనుక్కున్నారంటూ మహిళా సిబ్బంది కలెక్టరేట్‌లోనే దుమ్మెత్తి పోస్తున్నారు.

కలెక్టర్ చెప్పింది ఒకటి.. అధికారులు చేసేది మరొకటి..

తొలిసారి ప్రజావాణిలో హాస్టల్ సిబ్బంది ఫిర్యాదు చేసినప్పుడు కలెక్టర్ కుమార్ దీపక్.. ఈసారి టెండర్ వేరే వారికి ఇవ్వమని మీరే ఏజెన్సీ రిజిస్ట్రేషన్ చేయించుకోమని చెప్పినట్లు సిబ్బంది చెప్తున్నారు. ఇందుకోసమని అంతా కలిసి రెడ్ స్టార్ మ్యాన్‌పవర్ ఏజెన్సీ రిజిస్ట్రేషన్ చేసుకున్నామంటున్నారు. ఇందు కు కావాల్సిన అన్ని డాక్యుమెంట్స్ సిద్ధం చే సుకుని సోమవారం మళ్లీ కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చామంటున్నారు. కలెక్టర్ మాకే టెం డర్ ఇస్తామని చెప్తే జిల్లా అధికారులు మా త్రం టెండర్ నిర్వహిస్తామని, టెండర్ ఎవరికీ వస్తే వారే చేస్తారంటూ చెప్తున్నారని, ఇప్పు డు ఏంచేయాలో అర్థం కావడం లేదని వా పోతున్నారు. న్యాయం చేసే వరకు ఇక్కడి నుంచి వెళ్లేది లేదని స్పష్టం చేశారు. ఏజెన్సీ నిర్వాహకులను పిలిచి మాట్లాడుతామని చె ప్పిన అధికారులు సాయంత్రం 5 గంటల వ రకు పిలిపించకపోవడంతో వచ్చిన సిబ్బంది కలెక్టరేట్‌లోనే ఎదురు చూస్తూ ఉండిపోయా రు. దీనిపై జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి పోటు రవీందర్‌ను వివరణ కోరగా.. మార్చి వరకు వేతనాలు ప్రభుత్వం తరపున చెల్లించాల్సింది చెల్లించామన్నారు. జనవరి నుంచి రా లేదని సిబ్బంది చెప్తున్నారని, ఏజెన్సీ వాళ్లకు ఫోన్ చేస్తే సమాధానం చెప్పడం లేదన్నారు.

ఉదయం 8 గంటలకు వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జీఎం సంజీవరెడ్డి

ఒకే వాటర్ ప్లాంట్.. రెండు ప్రారంభోత్సవాలు

● సింగరేణి నిధులతో నిర్మాణం ● జీఎం ప్రారంభించాక.. తిరిగి ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్..

మంచిర్యాల, జూలై 8(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సింగరేణి సంస్థ నస్పూర్ కాలనీ సివిల్ ఆఫీస్(షిర్‌కే సెంటర్)లో రూ.10 లక్షలతో నూతనంగా మినరల్ వాటర్ ప్లాంట్‌ను నిర్మించింది. ఈ ప్లాంట్‌ను సోమవారం ఉదయం 8 గంటలకు శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమం అయిపోయాక ఉదయం 10.30 గంటలకు సన్నూర్ మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఆదేశాలంటూ జీఎం ప్రారంభించిన వాటర్ ప్లాంట్‌ను తిరిగి ప్రారంభించారు. పూర్తిగా సింగరేణి నిధులతో స్థానిక ప్రజలు, సింగరేణి కార్మికుల కోసం సంస్థ ఏర్పాటు చేసిన ప్లాంట్‌ను జీఎం ప్రారంభించాక చైర్మన్ వచ్చి మళ్లీ అదే ప్రారంభం చేయడంపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జీఎం ప్రారంభించినప్పుడే కార్యక్రమంలో పాల్గొంటే అయిపోయేదానికి కావాలనే ప్రచారం కోసం ఇలా చేస్తున్నారంటూ స్థానికులు చర్చించుకోవడం కనిపించింది.

జీఎం ప్రారంభించిన ప్లాంట్‌ను 10.30 గంటలకు తిరిగి ప్రారంభిస్తున్న చైర్మన్ సుర్మిళ్ల వేణు

ఉన్నతాధికారులు లేకపోవడంతో మధ్యాహ్నం 12.45 గంటలకే ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

కలెక్టర్ లేరు.. క్రమశిక్షణ లేదు

ప్రజావాణికి హాజరుకాని జిల్లా అధికారులు

ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం నామమాత్రంగా మారిపోయింది. కలెక్టర్ కుమార్ దీపక్ ప్రజావాణికి రావడం లేదని తెలిసి చాలా మంది జిల్లా ఉన్నతాధికారులు గైర్హాజరయ్యారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సిన ప్రజావాణిని 11 గంటలకు అదనపు కలెక్టర్ మోతీలాల్ వచ్చి ప్రారంభించారు. 12 గంటల వరకు అదనపు కలెక్టర్ ఉండి పోల్లిపోగా ఆర్డీవో, డీఆర్డీవో మాత్రమే ఉండగా.. మిగిలిన అధికారులు జారుకున్నారు. దీంతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లోని కుర్చీలు ఖాళీగా కనిపించాయి. కలెక్టర్ ఉన్నప్పుడు కిక్కిరిసిపోయే కుర్చీలు.. కలెక్టర్ లేకపోవడంతో బోసిపోయి కనిపించాయి. కలెక్టర్ ఉంటేనే క్రమశిక్షణ ఉంటుందా? అంటూ ప్రజావాణికి వచ్చిన పలువురు మాట్లాడుకున్నారు. ప్రజావాణి అధికారులు లేక వచ్చిన ఫిర్యాదుదారులు కొందరు నిరాశతో వెనుదిరగడం వెళ్లి పోవడం కనిపించింది.

- మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్

అక్రమంగా ఇసుక తవ్వుతాం.. అడ్డుకుంటే దాడులు చేస్తాం

ఇందారం గ్రామంలో రెచ్చిపోతున్న ఇసుక అక్రమార్కులు

● వీడియోలు తీసి సోషల్ మీడియాలో పెట్టిన వారిపై దాడికి యత్నం? ● ఎమ్మెల్యే వివేక్‌కు చెప్పినా పట్టింపు లేదంటూ కాంగ్రెస్ నాయకుల స్టేటస్‌లు

మంచిర్యాల, జూలై 8(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లాలో ఇసుక అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. గోదావరి పరీవాహక ప్రాంతమైన ఇందారం నుంచి రోజూ వందల సంఖ్యలో ట్రాక్టర్లు ఇసుకను అక్రమంగా తరలించుకుని పోతున్నాయి. ఈ నేపథ్యంలో ఇందారం గ్రామ యువకులు ఆదివారం గోదావరి నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల ఫొటోలు, వీడియోలు తీశారు. ''చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సార్.. మీకు ఎన్నిసార్లు చెప్పినా ఇలాంటి దందాలు యథేచ్ఛగా నడుస్తున్నాయి. ఇందారం గోదావరి బ్రిడ్జి పక్కనే ఇసుక దందా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ..'' సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. వాట్సాప్ గ్రూపుల్లో ఫొటోలు, వీడియోలను వైరల్ చేశారు. ఇది జీర్ణించుకోలేకపోయిన ఇసుక అక్రమార్కులు ఎవరైతే ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పెట్టారో.. వారి ఇండ్ల మీదకు ట్రాక్టర్ డ్రైవర్లు, వర్కర్లను తీసుకెళ్లి దాడికి యత్నించారు.

ఇందారం గోదావరి నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

దీనిపై సదరు యువకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా.. ఈ ఇసుక దందాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మండలాధ్యక్షుడు, ఇందారం మాజీ సర్పంచ్ ఉన్నట్లు సదరు వ్యక్తులు చెప్తున్నారు. వీరిద్దరికి రెండేసి ట్రాక్టర్ల చొప్పున ఉన్నాయని, వారే ఈ దందాను ముందుండి నడిపిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కాగా.. ఈ ఆరోపణలు చేస్తున్న యువకుల్లో కాంగ్రెస్ నాయకులు ఉండడం గమనార్హం. ఈ విషయాన్ని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ సార్ నోటీసుకు చాలా సార్లు తీసుకెళ్లామని, అయినా వీరిని అడ్డుకోలేకపోతున్నారని వాపోతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుకను అక్రమంగా తరలిస్తుంటే చూడలేక ఫొటోలు, వీడియోలు తీసి వైరల్ చేశామని, వాట్సాప్‌లో స్టేటస్‌లుగా పెట్టుకున్నామని చెప్తున్నారు. ఇప్పటికైనా ఈ అక్రమ దందాను అడ్డుకోవాలని కోరుతున్నారు. ఆదివారం సాయంత్రం ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేయకుండా పోలీసులు కాలయాపన చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. కొందరు ఉన్నత స్థాయి అధికారులు గడిచిన మూడు నెలలుగా ఇసుక అక్రమార్కుల నుంచి లక్షల్లో మామూళ్లు తీసుకుంటున్నారని, అందుకే చర్యలు తీసుకోడానికి వెనకాడుతున్నారని పేర్కొంటున్నారు. దీనిపై జైపూర్ ఎస్ఐ శ్రీధర్‌ను వివరణ కోరగా.. ఫిర్యాదు వచ్చిందని విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చెన్నూర్ ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని ఓ కాంగ్రెస్ కార్యకర్త పెట్టిన వాట్సాప్ స్టేటస్

పదవీ విరమణ ప్రజాసేవకు ఆటంకం కాదు

● మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

● తాజా మాజీ ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీపీలకు సన్మానం



తాజా మాజీ ప్రజాప్రతినిధులను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, జూలై 8 : ప్రజాసేవ చేయాలనే తపన ఉండాలే కాని పదవీవిరమణ దానికి ఆటంకం కాదని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య స్పష్టం చేశారు. సోమవారం బెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో నియోజకవర్గంలోని బీఆర్ఎస్‌కు చెందిన తాజా మాజీ ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలను ఆయన శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాజీ జడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణతో కలిసి మాట్లాడారు. ప్రజాసేవ చేస్తూ, నిత్యం ప్రజల మధ్య ఉండే వారికే ప్రజలు పట్టం కడుతారని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తప్పకుండా వారి ఆశీర్వచనంతో గెలుస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు సాధ్యం కాని హామీలిచ్చి ఇచ్చి ప్రజలను మోసం చేసి అబద్ధాలతో కాలం వెళ్లస్తున్నదని విమర్శించారు. 7 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరుద్యోగులు, విద్యార్థులు, రైతులు రోడ్లపైకి వచ్చి నిరసనలు చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రజల పక్షాన నిలబడి వారికి సంక్షేమ పథకాలు అందేవిధంగా చూడాల్సిన బాధ్యత ప్రతి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పార్టీని పటిష్టం చేయాల్సిన గురుతర బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని వెల్లడించారు.

నియోజకవర్గంలో వాడకో కాంగ్రెస్ ఎమ్మెల్యే..

బెల్లంపల్లి నియోజకవర్గంలో మండలం, వాడకో ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య విమర్శించారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యే హైదరాబాద్‌లో ఉంటూ టూరిస్టులా ఇక్కడికి రాకపోకలు సాగిస్తుండడంతో గల్లీకో ఎమ్మెల్యే తయారయ్యాడని ఆరోపించారు. ప్రజలకు సమస్య వస్తే మంచిర్యాల, హైదరాబాద్‌కు పరుగెత్తాల్సిన దుస్థితి నెలకొన్నదని మండిపడ్డారు. బెల్లంపల్లి పట్టణంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ ప్రారంభించకపోవడంతో చిరు వ్యాపారులు వర్షంలో బురదలో కూర్చుని కూరగాయలు విక్రయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే స్థానికంగా ఉండకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కన్నెపల్లి, వేమనపల్లి మండలాల్లో కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నాయకులపై అణిచివేత ధోరణికి పాల్పడుతున్నార విషయం తన దృష్టికి వచ్చిందని వెల్లడించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు పార్టీ, తాను ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, నియోజకవర్గంలోని తాజా మాజీ ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీలు పాల్గొన్నారు.

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం
మరియు
• అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679